సాక్షి ఖమ్మం

మంగళవారం । 21 । మార్చి । 2023



ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండొద్దు

గ్రీవెన్స్ డేలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు.

8లో



ఆర్థిక సంఘం నిధులొచ్చేశాయ్..

మండల ప్రజా పరిషత్‌లకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. దీంతో పనులకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు.

8లో

గరిష్టం / కనిష్టం
34° / 22°

వాతావరణం

జిల్లాలో వాతావరణం మంగళవారం ఉదయం చల్లగా ఉంటుంది. ఆ తర్వాత ఎండ పెరుగుతూ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది.

న్యూస్‌రీల్

సైబర్, సోషల్ మీడియా నేరాల కట్టడిపై దృష్టి



గ్రీవెన్స్‌లో బాధితుల ఫిర్యాదులు వింటున్న సీపీ

ఖమ్మంక్రైం: సైబర్ నేరాలు, సోషల్ మీడియా నేరాల కట్టడికి సైబర్ ల్యాబ్‌లను పటిష్టం చేయాలని సీపీ విష్ణు ఎస్.వారియర్ ఆదేశించారు. కమిషనరేట్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా పోలీసు అధికారులతో సమీక్షించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని కొందరు అనుకూలంగా మార్చుకుని అమాయకులను మోసం చేస్తున్నారని తెలిపారు. లక్కీ డ్రాలు, ఓటీపీలు పేరిట మోసాలు చేస్తుండడమే కాక మహిళల విషయంలో అసభ్యంగా ప్రవర్తిస్తున్నందున నేరాల కట్టడిపై దృష్టి సారించాలని సూచించారు. ఉద్యోగులకు విడతల వారీగా సైబర్ క్రైమ్, సోషల్ మీడియా నేరాల నియంత్రణపై నిపుణులతో శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. కాగా, కమిషనరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా సీపీ వారియర్ పలువురి నుంచి ఫిర్యాదులు స్వీకరించి తక్షణ చర్యల నిమిత్తం అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా భూవివాదాలు, కుటుంబ తగాదాలపై ఎక్కువ ఫిర్యాదులు అందాయని అధికారులు తెలిపారు.

లోటుపాట్లు లేకుండా పరీక్షలు



కేంద్రంలో విద్యార్థి వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ పరీక్షలు ఎలాంటి లోటుపాట్లు ఎదురుకాకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని నయబజార్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించడమే కాక మాస్ కాపీయింగ్ జరగకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే, అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి ఎస్ఆర్ కాలేజీ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి శాంతినగర్ పరీక్ష కేంద్రాల్లో తనిఖీ చేశారు. కాగా, సోమవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 18,913మంది విద్యార్థులకు గాను 17,994మంది హాజరు కాగా, 919మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ రవిబాబు తెలిపారు.

జమలాపురంలో రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల వివరాలు వెల్లడిస్తున్న ఈఓ, అర్చకులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈనెల 22నుండి 31వ తేదీ వరకు శ్రీవారి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈమేరకు సోమవారం ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ వివరాలను వెల్లడించారు. తొలిరోజైన 22న ఉగాది సందర్భంగా స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, పంచాగం పఠనంతో పాటు తీర్థపు బిందెను ఆలయంలోకి తీసుకొస్తారు. అలాగే, 23న ధ్వజారోహణం, 24న శ్రీవారి పాదానికి అభిషేకం, 25న స్వామి, అమ్మ వార్లకు కల్యాణమూర్తులుగా అలంకరణ, 26న శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమార్చన, ఎదుర్కోలు, 28న స్వామి, అమ్మ వార్ల కల్యాణోత్సవం, 29న పుష్పయాగం, 30న శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం నిర్వహించనుండగా, 31న పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

నేడు జిల్లాలోకి సీపీఎం జనచైతన్య యాత్ర

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆధ్వర్యాన చేపట్టిన జనచైతన్య యాత్ర మంగళవారం జిల్లాలోకి ప్రవేశించనుంది. మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఏన్కూర్ వద్ద జిల్లాలోకి ప్రవేశించే యాత్ర 7 గంటలకు తల్లాడకు వస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఇక 22న వైరా, మధిర, బోనకల్, 23న నాగులవంచ, ఖమ్మం, ఎం.వీ.పాలెం, 24వ తేదీన తిరుమలాయపాలెం, కూసుమంచి, తెల్దారుపల్లి, ముదిగొండ, 25న నేలకొండపల్లిలో యాత్ర సాగుతుందని పేర్కొన్నారు.

బకాయిల షాక్!



విద్యుత్ బిల్లులు చెల్లించని ప్రభుత్వ శాఖలు

- ఏటేటా పేరుకుపోతున్న వైనం
- గ్రామపంచాయతీల్లోనూ రూ.కోట్ల బిల్లులు పెండింగ్
- జిల్లావ్యాప్తంగా బకాయి రూ.31.55 కోట్లు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో ఏళ్లుగా పేరుకుపోయిన బకాయిలు వసూలు చేసేందుకు విద్యుత్ శాఖ కసరత్తు చేస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల బిల్లులు చెల్లించకపోవడంతో విద్యుత్ శాఖకు గుదిబండలా మారింది. రూ.కోట్లలో పేరుకుపోయిన బకాయిల వసూళ్లకు ఎన్ని యత్నాలు చేసినా ఫలితం రావడం లేదు. ఏళ్ల తరబడి బిల్లులు వసూలు కాకపోవడంతో విద్యుత్ శాఖాధికారులపై ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి వస్తుండగా.. ఎక్కువ బిల్లు ఉన్న కార్యాలయాలకు వెళ్లి త్వరగా చెల్లించాలని కోరుతున్నారు.

గ్రామపంచాయతీల్లోనే..

విద్యుత్ బిల్లుల బకాయిలు ఎక్కువగా గ్రామపంచాయతీల్లోనే ఉన్నాయి. జీపీల్లో వీధి దీపాలు, తాగునీటి సరఫరాకు విద్యుత్ అవసరం ఉండగా.. 5,692 కనెక్షన్లపై రూ.13,62,18,000 వసూలు కావాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో విద్యుత్ బిల్లులు చెల్లించలేకపోతున్నామని గ్రామపంచాయతీల బాధ్యులు చెబుతున్నారు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉండడంతో బకాయిలు రూ.కోట్లకు చేరాయి. మొత్తం బకాయిల్లో గ్రామపంచాయతీల్లోనే సింహభాగం ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

వసూలు యత్నాలు ఫలించేనా..

విద్యుత్ బకాయిలు వసూలు చేసేందుకు ఆ శాఖ అధికారులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. గతంలోనే పలుమార్లు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి సమాచారం ఇచ్చారు. తాజాగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో మరోమారు బకాయి ఉన్న ప్రభుత్వ శాఖల అధికారులను సంప్రదిస్తున్నారు. అయితే ఆయా కార్యాలయాలకు ప్రభుత్వం నుంచి బిల్లులు రావాల్సి ఉండడంతోనే చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని సమాచారం.

అత్యధిక విద్యుత్ బకాయిలు ఉన్న ప్రభుత్వశాఖలు

శాఖ	బకాయి
గ్రామపంచాయతీలు	
(వాటర్ వర్క్స్, వీధిదీపాలు)	రూ.13,62,18,000
ఖమ్మం కార్పొరేషన్	రూ.3,52,38,000
ఇతర శాఖలు	రూ.3,27,32,000
జలవనరుల శాఖ	రూ.2,75,26,000
విద్యాశాఖ	రూ.1,75,01,000
రెవెన్యూ	రూ.1,53,50,000
మెడికల్	రూ.1,37,41,000
పంచాయతీ రాజ్	రూ.86,17,000
పోలీస్	రూ.72,54,000
మున్సిపాలిటీలు	
(వాటర్ వర్క్స్, వీధిదీపాలు)	రూ.55,40,000
పీడబ్ల్యూడీ అండ్ ఆర్అండ్‌బీ	రూ.34,31,000
ఆర్‌డబ్ల్యూఎస్	రూ.32,48,000

పేరుకుపోతూ పెండింగ్‌లో



జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన బకాయిలు ఏటేటా పెరుగుతూనే ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 11,420 కనెక్షన్లకు సంబంధించి రూ.31,55,08,000 పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు చెల్లించాల్సిన ప్రభుత్వ కార్యాలయాల అధికారులు కూడా స్పందించకపోవడంతో ఫలితం ఉండడం లేదని విద్యుత్ శాఖ ఉద్యోగులు వాపోతున్నారు. గతంలో గ్రామపంచాయతీల బిల్లులు వసూలు కాక వీధి దీపాలు, కార్యాలయాల కనెక్షన్లు తొలగించిన సందర్భాలు ఉన్నాయి. ఇక జిల్లాలోని సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీలతోపాటు ఖమ్మం కార్పొరేషన్‌కు సంబంధించి బకాయి రూ.4 కోట్లకు పైగానే ఉంది. ఇలా అనేక ప్రభుత్వ శాఖల్లో రూ.వేల నుంచి రూ.కోట్ల వరకు బకాయిలు ఉండడం గమనార్హం.

‘ఎర్ర’ బంగారమే...



ఖమ్మం మార్కెట్‌కు విక్రయానికి తీసుకొచ్చిన మిర్చి

- ఖమ్మం మార్కెట్‌లో ‘తేజ’ మిర్చి రికార్డ్
- క్వింటాకు రూ.25,550గా ధర నమోదు
- కొనుగోళ్లను పరిశీలించిన రాష్ట్ర మంత్రి పువ్వాడ

ఖమ్మంవ్యవసాయం: ఎర్ర బంగారంగా పిలుచుకునే మిర్చికి నిజంగానే బంగారం మాదిరి ధర పెరుగుతోంది. తేజా రకం మిర్చికి ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మునుపెన్నడూ లేని విధంగా గరిష్ట ధర నమోదైంది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సమక్షాన సోమవారం ఖమ్మం మార్కెట్‌లో మిర్చి జెండాపాట నిర్వహించగా క్వింటాకు రూ.25,550 ధర పలికింది. తేజా రకం మిర్చిని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎక్కువగా సాగు చేస్తుండగా.. జిల్లా రైతులతో పాటు వరంగల్, నల్లగొండ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణ, గుంటూరు జిల్లాల నుంచి రైతులు ఇక్కడకు తీసుకొస్తారు. అయితే, ఈసారి సాగు తగ్గడంతో పాటు దిగుబడి పడిపోగా.. విదేశాల నుంచి స్థానిక వ్యాపారులకు ఆర్డర్లు ఉండడంతో మిర్చికి డిమాండ్ పెరిగింది. గతంలో అన్‌సీజన్‌లో నిల్వ మిర్చికి రూ.20వేలకు పైగా ధర పలకగా.. ఈసారి సీజన్‌లోనే రూ.25,500 నమోదు కావడం విశేషం. గత శుక్రవారం రూ.23వేలు పలికిన ధర రెండు రోజుల వ్యవధిలో రూ.2,550 పెరిగింది. మార్కెట్‌కు 23,809 బస్తాల మిర్చి రాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం ఉల్వనూరుకు చెందిన రైతు అచ్చా శ్రీను తీసుకొచ్చిన 90 బస్తాలకు అత్యధిక ధర లభించింది. ఇక మోడల్ ధర రూ.23 వేలు, కనిష్ట ధర రూ.17 వేలుగా పలికింది. ఈ సందర్భంగా అచ్చా శ్రీనును మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, వైస్ చైర్మన్ షేక్ అఫ్జల్ సన్మానించారు.



మార్కెట్‌లో కొనుగోళ్లను పరిశీలిస్తున్న మంత్రి పువ్వాడ అజయ్, చైర్‌పర్సన్ శ్వేత

ఖమ్మం మిర్చికి విదేశాల్లో డిమాండ్

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో విక్రయానికి వచ్చే తేజా రకం మిర్చికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉందని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. నాణ్యమైన మిర్చి కావడంతో తేజా రకానికి గతంలో ఎన్నడూ లేని విధంగా ధర పలికిందని, ఖమ్మం మార్కెట్‌ను ఎర్రబంగారానికి చిరునామాగా గుర్తింపు తీసుకొస్తామని చెప్పారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో కృషి జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కె.నాగరాజు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావుతో పాటు వ్యాపార ప్రతినిధులు జీ.వై.నరేష్, మన్నెం కృష్ణ, మాటేటి నాగేశ్వరరావు, ఎడ్లపల్లి సతీష్, దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, ముత్యం ఉప్పల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అనుకున్న ధర కంటే ఎక్కువ



ఆశించిన దానికి మిన్నగా మిర్చి ధర పలికింది. రెండు రోజుల క్రితం రూ.23 వేలు గరిష్టంగా ధర పలకడంతో కాస్త అటూఇటు వస్తుందని మిర్చి తీసుకొచ్చా. కానీ అధిక ధర రూ.25,550 ధర నేను తీసుకొచ్చిన మిర్చికి రావడం ఆనందంగా ఉంది. ఐదు ఎకరాల్లో నేను మిర్చి సాగు చేశా.

– అచ్చా శ్రీను, ఉల్వనూరు, పాల్వంచ

ధర కొంత ఆశాజనకమే..



తామర పురుగు కారణంగా దిగుబడి తగ్గి ఎకరాకు 10 క్వింటాళ్లు కూడా రావటం లేదు. పెట్టుబడి ఎకరాకు రూ.లక్షకు పైగానే అవుతోంది. అయితే, మిర్చి ధర పెరగటం ఆనందంగా ఉంది. 11 బస్తాల మిర్చి తీసుకొస్తే రూ.23 వేల చొప్పున ధర నమోదు కావడంతో భారం తగ్గినట్లే.

– లంగేపల్లి వెంకన్న, జూపెడ, తిరుమలాయపాలెం

ఉద్యోగాల పేరిట వసూళ్లు

- కేఎంసీలో ఉద్యోగాలంటూ అందినకాడికి దోపిడీ
- క్షేత్రస్థాయి సిబ్బంది, యూనియన్ల నేతలదే హవా
- పైసల వసూళ్లపై జోరుగా చర్చ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల నుండి కొందరు డబ్బు వసూలు చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. రెండు నెలల క్రితం ఓ కార్మిక సంఘం నాయకుడు డబ్బు చెల్లిస్తే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తామని ఒకరికి నమ్మబలికినట్లు సమాచారం. దీంతో సదరు వ్యక్తి డబ్బు ఇచ్చేందుకు సిద్ధమై ఆరా తీయగా సానుకూలమైన సమాధానం రాకపోవడంతో వెనక్కి తగ్గాడు. ఇదే తరహాలో పలువురు నిరుద్యోగుల నుండి డబ్బు వసూలు చేసేందుకు తెరలేపారు. ఆర్థికంగా వెనుకబడి, ఉపాధి లేని వారిని టార్గెట్‌గా చేసుకుంటున్న కొందరు దళారులు పబ్బం గడుపుకుంటున్నారు. కార్పొరేషన్‌లో తమకు పలుకుబడి ఉందని, అధికారులకు కొంత ఇస్తే కోరుకున్న విభాగంలో ఉద్యోగం వస్తుందనే మాయమాటలు చెబుతుండగా.. ఈ దోపిడీకి కేఎంసీని అడ్డాగా చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. దళారుల్లో యూనియన్ నాయకులు, క్షేత్రస్థాయి కార్మికులు, సిబ్బంది ఉన్నట్లు సమాచారం.

రూ.30 వేలకు పైగానే..

కార్పొరేషన్‌లో శానిటేషన్, పబ్లిక్ హెల్త్, డీఆర్ఎఫ్ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల కోసం రూ.30 వేల నుండి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఉద్యోగాల పేరిట మోసం చేసే వారిలో యూనియన్ల నాయకులు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, జవాన్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. వీరు అధికారుల పేరు చెప్పి డబ్బు వసూలు చేస్తుండడం గమనార్హం. ఇటీవల ఆరోపణలు ఎదుర్కొంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ కార్మికురాలు డబ్బు వసూలు చేసినట్లు అంగీకరించగా, ఈ వ్యవహారంలో జవాన్ పాత్రపై ప్రచారం జరుగుతోంది. డబ్బు ఇచ్చిన వారికి ఉద్యోగం రాక తిరిగి చెల్లించాలని డిమాండ్ చేస్తుండడంతో విషయం బయట పడినట్లు సమాచారం.

మోసపోతున్న నిరుద్యోగులు

ఉద్యోగంపై ఆశతో వందలాది మంది నిరుద్యోగులు మాయమాటలు చెప్పేవారిని నమ్మి మోసపోతున్నారు. నిత్యం కేఎంసీ కార్యాలయంలో తిష్ట వేసి.. అధికారులు, ఉద్యోగులతో సన్నిహితంగా మెదులుతూ, ప్రజాప్రతినిధులతో సఖ్యత ఉన్నట్లు చెప్పుకునే కొందరు ఈ మోసాలకు పాల్పడుతున్నారు. రాజకీయ పలుకుబడితో కొందరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పించగా, యూనియన్ నాయకులు ఇదే బాటలో వెళ్తున్నట్లు తెలుస్తోంది. కాగా, ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుండి డబ్బు వసూళ్ల ప్రచారంపై సోమవారం కేఎంసీలో చర్చ జరిగింది. వసూళ్లకు పాల్పడిన వారి విషయంలో ప్రజాప్రతినిధులు, మహిళా ప్రజాప్రతినిధుల భర్తలు గతంలో పంచాయితీలు నిర్వహించినట్లు సమాచారం.

నిరుద్యోగులు మోసపోవద్దు..



కేఎంసీలో ఉద్యోగాలు భర్తీ చేస్తే అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేస్తాం. ఆతర్వాత దరఖాస్తు తీసుకుని అర్హత ఆధారంగానే ఉద్యోగాలు ఇస్తాం. అంతేతప్ప డబ్బు చెల్లిస్తే ఉద్యోగం వస్తుందని ఎవరైనా చెబితే నమ్మొద్దు. కార్మికురాలు డబ్బు వసూలు చేసినట్లు ఒప్పుకుంది. ఈ విషయంలో విచారణ చేపట్టాం.

– ఆదర్శ్ సురభి, కేఎంసీ కమిషనర్

ముత్తంగి అలంకరణలో భద్రాద్రి రామయ్య

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు జరిపించారు.

అసైన్డ్ భూములు వెనక్కి...

- మల్లెమడుగు రెవెన్యూ పరిధిలో 19.05 ఎకరాల స్వాధీనానికి నిర్ణయం
- చేతులు మారినట్లు గుర్తించడంతో నిర్ణయం
- ఆర్డీఓ నుంచి తహసీల్‌కు అందిన ఆదేశాలు

ఖమ్మంఅర్బన్: పేదలు సాగు చేసుకోవడానికి ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డ్ భూములు పక్కదారి పట్టినట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఖమ్మం అర్బన్ మండలం మల్లెమడుగు పరిధి సర్వేనంబర్ 196, 189ల్లోని 19.05 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్‌కు ఆర్డీఓ రవీంద్రనాథ్ తాజాగా ఆదేశాలు జారీ చేశారు. అసైన్డ్ భూమిని తమకు తెలియకుండానే ప్లాట్లుగా మార్చారని కొందరు చేసిన ఫిర్యాదుతో కలెక్టర్ గౌతమ్ విచారణ జరిపించగా అక్రమాలు నిజమేనని తేలింది. దీంతో సదరు భూమి స్వాధీనానికి అధికారులు సిద్ధమయ్యారు.

సాగు అవసరాల కోసం..

సెంట్ భూమి లేని నిరుపేదలు సాగు చేసుకునేందుకు ఇక్కడ భూమిని ఏళ్ల క్రితమే రఘునాథపాలెంకు చెందిన పేదలకు పంపిణీ చేశారు. అయితే, ఈ భూమిని సాగు అవసరాలకు ఉపయోగించుకోవాలే తప్ప క్రయవిక్రయాలకు అనుమతి ఉండదు. కానీ భూమి విలువ అమాంతం పెరిగిపోవడంతో దశాబ్దాల క్రితం పేదల అమాయకత్వాన్ని ఆసరా చేసుకున్న రియల్టర్లు కొందరు రెవెన్యూ అధికారుల అండదండలతో అసైన్డ్ భూములను పట్టా భూములుగా రికార్డుల్లోకి ఎక్కించినట్లు సమాచారం. ఆతర్వాత ప్లాట్లు చేసి అమ్మకాలు చేపట్టగా... బానోతు సక్కుబాయి, అక్కి తులశమ్మ, అక్కి గంగయ్యతో పాటు మరో ఇద్దరు తమకు తెలియకుండా భూములను ప్లాట్లుగా మార్చి విక్రయించారని కలెక్టర్ గౌతమ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టగా పలు అంశాలు వెల్లడయ్యాయి. 1975లో సీసీ నంబర్ 3045/75 ద్వారా మిగులు భూముల కింద ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఆ తర్వాత ఆర్డీఓ కార్యాలయంలో 3057/1989 ద్వారా 38 ఎకరాలను అసైన్ చేసినట్లు సమాచారం. అనంతరం హెచ్5/1990 ద్వారా ఈ భూములకు సప్లిమెంటరీ సెత్వార్ జారీ చేశారు. ఈ సమయాన అక్రమాలు జరగగా, భూయజమానుల ఫిర్యాదు మేరకు భూములు స్వాధీనం చేసుకోవాలని ఖమ్మం అర్బన్ తహసీల్దార్‌కు ఖమ్మం ఆర్డీఓ ఆదేశాలు జారీ చేశారు.

అమ్మేసిన రియల్టర్లు

రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవడానికి సిద్ధమైన అసైన్డ్ భూములు చాలా ఏళ్ల క్రితమే రియల్టర్లు ప్లాట్లుగా చేసి అమ్మేసుకున్నారు. జిల్లా కేంద్రానికి సమీపాన ఉండడంతో మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇప్పుడు అధికారులు స్వాధీనం చేసుకోనుండడంతో తమ పరిస్థితి ఏమిటని వారు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై అర్బన్ తహసీల్దార్ శైలజను వివరణ కోరగా, క్రయవిక్రయాలు జరిగిన అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకోవాలని ఆర్డీఓ నుండి సోమవారం ఆదేశాలు అందాయని తెలిపారు. రెండు సర్వే నంబర్ల పరిధిలో 19.05 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోనున్నట్లు వివరించారు.

నివేదికలు ఇవ్వండి..

- పంట నష్టంపై దృష్టి సారించిన ప్రభుత్వం
- జిల్లాలో 31,038 ఎకరాల్లో పంట నష్టం



వనంవారి కిష్టాపురంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: ఇటీవల నాలుగు రోజుల పాటు ఈదురుగాలులు, వడగండ్లతో కూడిన వర్షంతో జిల్లాలో పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా మొక్కజొన్న పంటకు తీరని నష్టం వాటిల్లినట్లుగా అధికారులు తమ పరిశీలనలో గుర్తించారు. ఈమేరకు ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా అధికారులు అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలపై ఉన్నతాధికారులకు సోమవారం నివేదిక పంపించారు. ప్రధానంగా కోత దశలో ఉన్న మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం జరగగా.. అక్కడక్కడ పెసర, వరి, మామిడి, మిర్చి పంటలకు కూడా నష్టం జరిగినట్లు అంచనా వేశారు. మొత్తంగా ఐదు రోజుల వర్షాలతో జిల్లాలో 157 గ్రామాల్లో 19,732 మంది రైతులకు చెందిన 31,038 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు నివేదికలో పొందుపరిచారు.

పరిహారానికి అవకాశం

రాష్ట్ర ప్రభుత్వం అకాల వర్షాలతో జరిగిన పంట నష్టంపై నివేదిక సేకరించిన నేపథ్యాన పరిహారంపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. ప్రకృతి వైపరీత్యాల సంభవించిన సందర్భాల్లో ప్రభుత్వం రైతులకు పరిహారం చెల్లిస్తుంది. అలాగే, పలు పంటలకు బీమా పథకం వర్తిస్తుంది. అయితే, 33 శాతానికి పైగా పంట నష్టపోతేనే పరిహారం అందే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఏదిఏమైనా రైతులు మాత్రం నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

వ్యవసాయ డివిజన్ల వారీగా పంట నష్టం వివరాలు (ఎకరాల్లో)

డివిజన్	మొక్కజొన్న	పెసర	ఇతర పంటలు	మొత్తం
మధిర	21,901	77	--	21,978
వైరా	7,346	--	04	7,350
ఖమ్మం	606	115	10	731
కూసుమంచి	526	34	06	566
సత్తుపల్లి	413	--	--	413
మొత్తం	30,792	226	20	31,038

క్లుప్తంగా

మంత్రిని కలిసిన రవాణా శాఖ అధికారులు


మంత్రి పువ్వాడతో ఆర్టీఓ కిషన్‌రావు, ఏఎంవీఐ వరప్రాద్

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను ఆర్టీఓ కిషన్‌రావు, ఏఎంవీఐ వరప్రసాద్ సోమవారం ఖమ్మంలో కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రవాణాశాఖ ద్వారా రూ.6,055 కోట్ల ఆదాయం సమకూరిందని, గతేడాదితో పోలిస్తే ఇది రూ.2,309 కోట్లు అదనమని తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఇంకా రూ.230 కోట్ల ఆదాయం వచ్చే అవకాశముందని చెప్పారు. మంత్రి పువ్వాడ తీసుకున్న నిర్ణయాలు, శాఖలో చేసిన మార్పులతో ఆదాయం మెరుగైందని అధికారులు వివరించగా, మంత్రి వారిని అభినందించారు.

26న 'హాథ్ సే హాథ్' యాత్ర


మాట్లాడుతున్న రామ్మూర్తి నాయక్, పక్కన రాధాకిషోర్, ఎడవెల్లి కృష్ణ తదితరులు

వైరా: వైరాలో ఈనెల 26న నిర్వహించనున్న హాథ్ సే హాథ్ జోడోయాత్ర, సభను విజయవంతం చేయాలని టీ పీసీసీ సభ్యుడు ధరావత్ రామ్మూర్తినాయక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి యడవల్లి కృష్ణ పిలుపునిచ్చారు. వైరాలో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ వైరాలోని అయ్యప్పస్వామి దేవాలయం నుండి తల్లాడ రోడ్డులోని సాయిబాబా దేవాలయం వరకు యాత్ర, అక్కడ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్‌ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి తదితరులు ఈ సభకు హాజరవుతారని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు మానుకొండ రాధాకిషోర్, కట్ల రంగారావు, సూరంపల్లి రామారావు, పగడాల మంజుల, రామసహాయం మాధవరెడ్డి, దశ్‌సింగ్, శ్రీనివాసరెడ్డి, ముస్తఫా, మంగీలాల్, సంతోష్, నాగరాజు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ ఉద్యోగిపై దాడి కేసు ఉపసంహరణ

నేలకొండపల్లి: డీసీసీబీ ఉద్యోగిపై దాడి చేయడంతో పెట్టిన కేసును సోమవారం ఉపసంహరించుకున్నారు. మండలంలోని ముజ్జుగూడెంలో ఈనెల 17న నేలకొండపల్లి డీసీసీబీ ఉద్యోగులు రుణాల వసూళ్లకు వెళ్లిన క్రమంలో గ్రామానికి చెందిన బి.శ్రీను, డీసీసీబీ ఉద్యోగి నారాయణ మధ్య వివాదం జరగగా శ్రీను దాడిచేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, డీసీసీబీ బ్రాంచ్‌కు సోమవారం వచ్చిన శ్రీను తన బకాయి రూ.16వేలు చెల్లించడంతో పాటు యాదృచ్ఛికంగా ఘటన జరిగినందున క్షమించాలని కోరాడు. దీంతో కేసు ఉపసంహరించుకున్నట్లుగా మేనేజర్ ఇందు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండొద్దు..

గ్రీవెన్స్ డేలో కలెక్టర్ గౌతమ్


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వీ.పీ.గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందిస్తున్న ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ప్రజావాణి(గ్రీవెన్స్ డే)లో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్‌డేకి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చి ప్రజలు అందించిన ప్రతీ ఫిర్యాదును పరిశీలించి సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈ సమయంలో కొన్ని ఫిర్యాదులను తక్షణమే అక్కడికక్కడే సంబంధిత అధికారులతో, మండలాల అధికారులతో వీడియో కాల్ చర్చించి పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రధానంగా భూసంబంధిత సమస్యలు, ఆసరా పెన్షన్ల మంజూరు కోసం వచ్చాయి. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్నేహలత, డీఆర్వో శిరీష, ఏఓ కారుమంచి శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- కామేపల్లి మండలం కొత్త లింగాలకు చెందిన బోధకాలు బాధితురాలు పర్సా ఈశ్వరమ్మ, కొణిజర్లకు చెందిన పక్షవాతంతో బాధపడుతున్న కొర్రా వెంకన్న ఆసరా పింఛన్ ఇప్పించాలని విన్నవించారు.
- తల్లాడ మండలం కలకొడిమకు చెందిన రైతు కొత్తపల్లి కృష్ణారావు తన భూమి ఆన్‌లైన్‌లో అసైన్డ్ భూమిగా చూపిస్తున్నందున సరిచేయాలని కోరారు.
- ఎర్రుపాలెం మండలం భీమవరానికి చెందిన కొమ్మినేని నాగేశ్వరరావు తన ఇళ్లు రోడ్డు విస్తరణలో కోల్పోయినందున, కల్వర్టును కుదించాలని విన్నవించారు..
- ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఐదు నెలలుగా ఎస్‌ఐ, కానిస్టేబుల్, గ్రూప్స్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు మరికొంతకాలం తమకు ఇక్కడ ఉండే అవకాశం కల్పించాలని కోరారు.

థ్యాంక్యూ సార్!

రెండు వారాల క్రితం ఖమ్మం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణికి హాజరైన ఖమ్మం గట్టయ్య సెంటర్‌కు చెందిన దివ్యాంగురాలు కూరపాటి రాంబాయి హాజరై తనకు ట్రైసైకిల్ ఇప్పించాలని కలెక్టర్ గౌతమ్‌కు విన్నవించింది. దీంతో ఆయన ఆయన ఆదేశాల మేరకు సంక్షేమశాఖ అధికారులు ఇటీవల ట్రై సైకిల్ సమకూర్చారు. ఈమేరకు సోమవారం గ్రీవెన్స్ సెల్‌కు రాంబాయి మళ్లీ వచ్చింది. ఆమెను చూడగానే కలెక్టర్ వేదిక పైనుంచి కిందకు దిగొచ్చి మాట్లాడారు. దీంతో ఆమె తనకు ట్రై సైకిల్ అందిందని చెబుతూ కలెక్టర్ గౌతమ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞత చాటుకున్నారు.


కలెక్టర్‌కు కృతజ్ఞతలు చెబుతున్న రాంబాయి

వినూత్న సాహిత్య ప్రక్రియలో రికార్డు


సత్కారం అందుకున్న పద్యకవులు, అతిథులతో నిర్వాహకులు

సత్తుపల్లి: ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని చెబుతుండగా.. సత్తుపల్లికి చెందిన ఆర్వీ.రమణమూర్తి, పీవీఎస్.మల్లికార్జున్‌రావు మాత్రం ఉద్యోగ విరమణ తర్వాత కూడా పద్య రచన కవులుగా ఖ్యాతి గడిస్తున్నారు. వీరిరువురు 108 సమస్యలను పద్య పాదాలుగా కూర్చుకుని చెరో 108 పద్యాలతో శతకాలు రాశారు. ఈమేరకు సోమవారం స్థానిక జేవీఆర్ డిగ్రీ కళాశాలలో పద్య పఠనం గావించగా... ముఖ్యఅతిథిగా తెలుగుబుక్ ఆఫ్ నేషన్ రికార్డ్స్ జాతీయ అధ్యక్షుడు చింతపట్ల వెంకటాచారి పాల్గొని అవార్డులు అందచేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ పానెం రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకటాచారి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ వృత్తికే కానీ అభిరుచులకు కాదని నిరూపించారని కొనియాడారు. సృజన సాహితీ సమాఖ్య ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో రామకృష్ణ, గట్టే వాసు, బి.మధుసూదన్‌రాజు, నాగేశ్వరరావు, గురుజ్యోతి, చిత్తలూరి ప్రసాద్, సాగర్, కిషోర్‌రెడ్డి, గాదె నర్సింహారెడ్డి, కేశవరెడ్డి, బద్రుద్దీన్, ప్రకాశరావుతో పాటు శ్రీనివాసరావు, మాల్యాద్రి, డాక్టర్ మాధురి, బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

దళితబంధుతో ఆర్థికాభివృద్ధి


రెడీమేడ్ షాపులో రికార్డులు చూస్తున్న కలెక్టర్

చింతకాని: దళితబంధు యూనిట్లను సక్రమంగా వినియోగించుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ లబ్ధిదారులకు సూచించారు. చింతకాని మండలం ప్రొద్దుటూరులో పలువురి యూనిట్లను సోమవారం రాత్రి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూనిట్లను అభివృద్ధి చేసుకుంటూ మరికొందరికి ఉపాధి కల్పించాలని తెలిపారాఉ. ఈసందర్భంగా రెడీమెడ్ దుస్తులు, కిరాణం షాపులు, పేపర్‌ప్లేట్ల పరిశ్రమను పరిశీలించి ఆదాయ వివరాలు తెలుసుకున్నారు. దళితబంధు ప్రత్యేకాధికారి పరంధామరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ మంగీలాల్, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులు వచ్చేశాయ్..

- మండల పరిషత్‌లకు విడుదల చేసిన ప్రభుత్వం
- జిల్లాలో రూ.7.57 కోట్ల పనులకు ప్రతిపాదనలు


నేలకొండపల్లిలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమ్య

నేలకొండపల్లి: జిల్లాలోని మండల ప్రజాపరిషత్‌లకు ఎట్టకేలకు నిధులు మంజూరయ్యాయి. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో చేపట్టనున్న పనులను ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులు ఆదేశించారు. జిల్లాలోని మండలాలకు సంబంధించి దాదాపు రూ.7,57,72,743 మంజూరయ్యాయి. ఈ నేపథ్యాన నేలకొండపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం బ్లాక్ పంచాయతీ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ వజ్జా రమ్య అధ్యక్షత వహించగా, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, ఎంపీఓ శివ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధి కారులు పాల్గొన్నారు. 2011 జనాభా ప్రకారం చేపట్టాల్సిన పనులపై వారు చర్చించారు. ప్రధానంగా తాగునీరు, డ్రెయినేజీలు, సీసీ రహదారులతో పాటు అత్యవసర పనులు చేపట్టాలని నిర్ణయించారు.

మండలాల వారీగా మంజూరైన నిధులు

మండలం	గ్రాంట్
ఖమ్మం రూరల్	రూ.53,78,514
సింగరేణి	రూ.47,36,267
కల్లూరు	రూ.46,99,589
కూసుమంచి	రూ.45,28,078
నేలకొండపల్లి	రూ.44,13,014
ముదిగొండ	రూ.40,50,242
రఘునాథపాలెం	రూ.39,92,210
తల్లాడ	రూ.39,39,576
పెనుబల్లి	రూ.38,21,575
కొణిజర్ల	రూ.36,92,907
సత్తుపల్లి	రూ.33,47,937
కామేపల్లి	రూ.33,07,368
చింతకాని	రూ.33,03,041
బోనకల్	రూ.31,62,698
ఏన్కూర్	రూ.27,17,421
మధిర	రూ.26,91,049

పరీక్ష కేంద్రంలో కళ్లు తిరిగి పడిపోయిన విద్యార్థిని

ఆస్పత్రికి తరలించిన ట్రాఫిక్ పోలీసులు


విద్యార్థినిని ఆస్పత్రికి తరలిస్తున్న ఎస్‌ఐ, కానిస్టేబుల్

ఖమ్మంక్రైం: ఇంటర్ పరీక్ష కేంద్రం వద్ద కళ్లు తిరిగి పడిపోయిన ఓ విద్యార్థినిని అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఎస్‌ఐ, కానిస్టేబుళ్లు సకాలంలో ఆస్పత్రికి తరలించి అండగా నిలిచారు. ఖమ్మం గుట్టల బజార్‌లోని కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుచున్న విద్యార్థిని పి.దీపిక ఇల్లెందు క్రాస్‌రోడ్డులోని కళాశాలలో బాటనీ పరీక్ష రాయడానికి బాబాయి కిరణ్‌కుమార్‌తో కలిసి సోమవారం వచ్చింది. ఆయన వెళ్లాక మూడో అంతస్తులోని గదికి వెళ్లిన దీపిక తనకు నలతగా ఉందని వాష్ రూమ్‌కు వెళ్తూ కింద పడిపోయింది. దీంతో అక్కడ విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఎస్‌ఐ మదార్, కానిస్టేబుల్ సాయిలు ఆమెను వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించడమే కాక దీపిక కుటుంబీకులు, కాలేజీ యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు. కాగా, ఐసీయూలో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్యం ఇప్పుడు నిలకడగానే ఉందని, పరీక్ష కారణంగా టెన్షన్‌కు గురై ఉంటుందని వైద్యులు వెల్లడించారు.

నకిలీ రిజిస్ట్రేషన్‌లో మరో ఇద్దరి అరెస్ట్

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలం తనగంపాడుకు చెందిన భూయజమాని దంపతులు బతికే ఉన్నా చనిపోయినట్లు నకిలీ ధృవపత్రాలతో భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకొన్న వ్యవహారంలో అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఇప్పటికే ఈ కేసులో ఐదుగురు వ్యక్తులు పాలుపంచుకున్నట్లు గుర్తించిన పోలీసులు వారం క్రితం అరెస్ట్ చేశారు. అయితే, కేసులో ముఖ్యుల పాత్రపై పోలీసులు దృష్టి సారించని అంశంపై ఈనెల 17న 'సాక్షి'లో 'పెద్దలను వదిలేసినట్లేనా?' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన పోలీస్ ఉన్నతాధికారులు గతంలో అరెస్ట్ అయిన ఐదుగురిలో నుంచి ఇద్దరిని కస్టడీకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈమేరకు సోమవారం పోలేపల్లికి చెందిన పోలా రాజేష్, ఖమ్మంకు చెందిన మాదా దశరథ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో మరికొందరు పాలుపంచుకున్నారని, వీరిలో ప్రముఖులు ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. దీంతో అందరినీ అరెస్ట్ చేస్తారా, లేదా అన్నది తేలాల్సి ఉంది. కాగా, రిజిస్ట్రేషన్ సమయాన సమర్పించిన పత్రాలను సరిగ్గా పరిశీలించకుండా పని పూర్తిచేసిన డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీని ఉన్నతాధికారులు రూరల్ మండలం నుండి వేంసూరుకు బదిలీ చేశారు.

గిరిజన చట్టాల అమలులో నిర్లక్ష్యం విడనాడాలి


ఆర్డీఓ కార్యాలయ ముట్టడికి వచ్చిన గిరిజనులు

కల్లూరు: స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి ఉన్న ఏజెన్సీ చట్టాల అమలులో అధికారులు నిర్లక్ష్యాన్ని విడనాడాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ధర్మోసోత్ దశరథ్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యాన వందలాది మందితో సోమవారం కల్లూరు ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ పెనుబల్లి మండలం వీఎం బంజర ఏజెన్సీ ప్రాంతం కాగా, గిరిజనేతరులు ఏజెన్సీ చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వీఎం బంజర్‌కు చెందిన వడిత్యా వెంకటేశ్వర్లు టేకులపల్లికి చెందిన దండే ఏడుకొండల నుంచి అవసరం నిమిత్తం రూ.40 లక్షలు అప్పు తీసుకుని తిరిగి ఇచ్చేసినా తనఖా పెట్టిన భూమిని కబ్జా చేశాడని పేర్కొన్నారు. ఏజెన్సీ చట్టాల ప్రకారం తనఖా పెట్టుకోవడంపై నిషేధం ఉన్నా వెంకటేశ్వర్లుకు న్యాయం చేయాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అనంతరం ఆర్డీఓ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేయగా, సీఐలు కరుణాకర్, సీఐ హనూక్ ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటుచేశారు. గోండువాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కొమరం బుచ్చయ్యగౌడ్‌తో పాటు లకావత్ నాగేశ్వరరావు, నందానాయక్, ఇస్లావత్ నాగేశ్వరరావు, నాగేశ్వరరావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఖజానా శాఖ డీడీకి సన్మానం


డీడీని సన్మానిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: కరోనా వైరస్ సమయాన ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంటపల్లి సత్యనారాయణ రూపొందించిన కరోనా కార్టూన్లతో ఇటీవల పుస్తకాన్ని వెలువరించారు. ఈ పుస్తకాన్ని సోమవారం కలెక్టర్ వీ.పీ.గౌతమ్ కలెక్టరేట్‌లో ఆవిష్కరించి సత్యనారాయణను అభినందించారు. అదనపు కలెక్టర్ స్నేహలత, డీఆర్వో శిరీష, అధికారులు, ఉద్యోగులు మోదుగు వేలాద్రి, ప్రసన్నకుమార్, కృష్ణకుమారి, విజయ్ కుమార్, సాగర్, మంజుల, శారద తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

ఖమ్మం లీగల్: గంజాయి రవాణా కేసులో ఖమ్మంకు చెందిన ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.డానీరూథ్ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఖమ్మం పోలీసులు బస్టాండ్ దగ్గర చేపట్టిన తనిఖీల్లో నగరానికి చెందిన పెడకంటి భూలక్ష్మి, పూస వెంకటేశ్వర్లుతో పాటు మరో వ్యక్తి 1.2 కేజీల గంజాయితో పట్టుబడ్డారు. వీరిపై కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా, విచారణలో నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. అయితే, కేసులో ఓ నిందితుడు చనిపోగా, వెంకటేశ్వర్లు కోర్టుకు హాజరుకాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. అలాగే, భూలక్ష్మిని జైలుకు తరలించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ కొత్తా వెంకటేశ్వరరావు వాదించగా, ఎం.రామకృష్ణ, ఎం.వెంకటేశ్వర్లు, ఎం.డీ.అయూబ్ సహకరించారు.

చోరీ కేసులో రెండు నెలలు...

ఖమ్మంకు చెందిన మహ్మద్ మతిన్‌కు చోరీ కేసులో రెండు నెలల జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు న్యాయమూర్తి ఎస్.శాంతిసోని సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం. ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేటలోని శ్రీ వెంకటేశ్వర ఫార్మాసూటికల్ డిస్ట్రిబ్యూటర్ షాప్‌లో 2018 జూలై 19న రాత్రి మతిన్ చోరీకి పాల్పడ్డాడు. ఈ విషయమై కేసు నమోదు చేసిన ఖమ్మం టూటౌన్ పోలీసులు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. విచారణలో ఆయనపై నేరం రుజువు కావడంతో పాటు మరో 12కేసుల్లో కలిపి మతిన్‌కు రెండు నెలల జైలుశిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ అనిల్‌కుమార్ వాదించగా, కానిస్టేబుల్ ముత్తయ్య సహకరించారు.

ఆసరా కోసం వచ్చి అస్వస్థత


పాషాను అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న సిబ్బంది

ఖమ్మం సహకారనగర్: సత్తుపల్లి మండలం అయ్యగారిపేటకు చెందిన పఠాన్ పాషా తనకు ఆసరా పెన్షన్ ఇప్పించాలని కోరుతూ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి(గ్రీవెన్స్ డే)లో వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చాడు. ఈక్రమంలోనే ఆయన అస్వస్థతకు గురికాగా వెంటనే 108ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఆయనకు సదరం సర్టిఫికెట్ జారీ చేసేలా చర్యలు చేపట్టామని అధికారులు తెలిపారు.

విందులో మటన్ తక్కువగా వేశారని ఘర్షణ

కారేపల్లి: వివాహ విందులో మటన్ తక్కువగా వేశారనే కారణంతో జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలయ్యాయి. కారేపల్లి మండలం గుంపెళ్లగూడెంకు చెందిన మూడ్ ఈర్యా కుటుంబం మాణిక్యారం గ్రామ పరిధి గుడితండాలోని బానోతు రాములు ఇంట్లో ఆదివారం సాయంత్రం జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. అయితే, భోజనం సందర్భంగా మటన్ కూర తక్కువ వేస్తున్నారని ఈర్యా కుటుంబానికి, మాణిక్యారానికి బానోతు నరేష్, కిరణ్, నవీన్, రాజేష్, రమేష్ నడుమ వాగ్వాదం జరిగింది. ఇది కాస్త ఘర్షణకు దారి తీయడంతో నరేష్, కిరణ్, నవీన్, రాజేష్, రమేష్ రాడ్లతో ఈర్యా, ఆయన భార్య కళ్యాణి, భూక్యా చిన్నపై దాడికి పాల్పడగా తీవ్రంగా గాయపడ్డారు. ఈమేరకు బాధితుల ఫిర్యాదుతో ఐదుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్సై రామారావు తెలిపారు.

కలప స్వాధీనం

తల్లాడ: మండలంలోని బాలపేటలో అక్రమంగా నిల్వ చేసిన కలపను సోమవారం రాత్రి అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో నార వేప నిల్వ చేశారన్న సమాచారంతో డీఆర్‌ఓ శ్రీనివాస్, సిబ్బందితో వెళ్లి తనిఖీలు చేపట్టగా 30 దిమ్మెలు లభ్యమయ్యాయి. ఈ విషయమై తల్లాడ అటవీ క్షేత్రాధికారి అరవింద్ మాట్లాడుతూ కలప ఎవరిదనే సమాచారం తెలియలేదని, మంగళవారం విచారణ చేపడుతామని తెలిపారు.


స్వాధీనం చేసుకున్న కలప

క్లుప్తంగా...

టీడీపీ 'సామాజిక' చిచ్చు

- సభా విలువలు.. సభాపతి స్థానంపై ఆ పార్టీకి గౌరవం లేదు
- వేళ్లు చూపిస్తూ.. సభ కనిపించకుండా ముఖానికి ప్లకార్డులు అడ్డుపెడతారా?
- ప్లకార్డు అడ్డు తొలగిస్తే స్పీకర్ కొట్టేశారంటూ గోల చేస్తారా?
- టీడీపీ సభ్యుల అనుచిత ప్రవర్తనపై స్పీకర్ తమ్మినేని సీతారాం ఆవేదన

'సభాపతి స్థానానికి కొన్ని పద్ధతులుంటాయి. వాటిని పట్టించుకోకుండా టీడీపీ సభ్యులు పోడియంపైకి వచ్చి నినాదాలు చేస్తారు. చైర్‌ను చుట్టిముట్టి గుద్దుతారు. నా ముఖంపై వేళ్లు చూపిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్నారు. డోలా వీరాంజనేయస్వామి ప్రవర్తించిన తీరు హేయంగా ఉంది. అచ్చెన్నాయుడు కింద నుంచే సభ కనిపించకుండా నా ముఖానికి ఎదురుగా ప్లకార్డు అడ్డుపెడతారు. ఎమ్మెల్యే ఏలిజా (వైఎస్సార్‌సీపీ) వచ్చి మా హక్కులు రక్షించాలని కోరుతుంటే.. టీడీపీ సభ్యుడు నా ముఖానికి అడ్డుగా పెట్టిన ప్లకార్డును పక్కకు జరిపాను. అది కింద పడిపోయింది. అంతే.. వెంటనే స్పీకర్ కొట్టేశారంటూ గోలచేశారు. ఇలా చేయమని మీకు ఎవరు చెప్పి పంపిస్తున్నారు? ఇది మంచి సంస్కారం కాదు'..

– ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అసెంబ్లీకి బ్లాక్‌డే

ఏపీ శాసనసభలో పరాకాష్టకు చేరిన టీడీపీ ఎమ్మెల్యేల అరాచకం


శాసనసభలో స్పీకర్ తమ్మినేని సీతారాంపై పేపర్లు విసురుతూ.. దాడి చేస్తున్న టీడీపీ సభ్యులు

సాక్షి, అమరావతి: ఈసారి అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నుంచి సభను అడ్డుకోవడమే లక్ష్యంగా నిత్యం రచ్చరచ్చ చేస్తున్న టీడీపీ సభ్యుల దుశ్చర్య సోమవారం పరాకాష్టకు చేరుకుంది. ఏకంగా సభాపతి తమ్మినేని సీతారాంపై దాడికి తెగబడ్డారు. సభా సంప్రదాయాలను తుంగలో తొక్కుతూ చరిత్రలో ఎన్నడూలేని విధంగా టీడీపీ ఎమ్మెల్యేలు తమ వికృత చేష్టలను బయటపెట్టారు. సభ సోమవారం ఉదయం ప్రారంభం కాగానే జీఓ–1 రద్దు మీద తామిచ్చిన వాయిదా తీర్మానంపై చర్చకు టీడీపీ సభ్యులు పట్టుబట్టారు. ప్రశ్నోత్తరాల తర్వాత వాయిదా తీర్మానంపై నిర్ణయం తీసుకుంటానని చెబుతూ స్పీకర్ క్వశ్చన్ అవర్‌ను ప్రారంభించారు. దీంతో అచ్చెన్నాయుడు స్పీకర్ వైపు వేలు చూపిస్తూ ముందు తామిచ్చిన వాయిదా తీర్మానాన్ని సభలో చదివి వినిపించాలంటూ బిగ్గరగా కేకలు వేశారు. టీడీపీ సభ్యులంతా ప్లకార్డులతో వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేయడం మొదలు


టీడీపీ సభ్యుల దాడిలో గాయపడిన దళిత ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

పెట్టారు. స్పీకర్ టేబుల్‌పై ఉన్న పుస్తకాలు, పత్రాలు చించివేస్తూ ఆయన ముఖంపైకి విసరడం ప్రారంభించారు. స్పీకర్ అటెండర్‌ను పక్కకు తోసేసిన టీడీపీ ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామి స్పీకర్‌కు అడ్డంగా నిలబడి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అంతేకాకుండా స్పీకర్ ముఖంపై ప్లకార్డును అడ్డంగా పెట్టడంతో పాటు ఆయనపై చేయిచేసుకున్నారు. ప్లకార్డు స్పీకర్ కంటికి తగలడంతో ఆయన దాన్ని పక్కకు తోసివేయడంతో అది కిందపడింది. దీంతో డోలా బాలవీరాంజనేయస్వామితో పాటు టీడీపీ సభ్యులు స్పీకర్ చైర్ చుట్టూ మూగి ఆయనపై దాడికి తెగబడ్డారు.

ఎస్సీ ఎమ్మెల్యేలపై దాడి..

అదే సమయంలో.. తమ హక్కులు కాపాడాలంటూ వెల్ బయటి నుంచి విన్నవిస్తున్న చింతలపూడి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా సభాపతిపై జరుగుతున్న దాడిని గమనించి పోడియం పైకెళ్లి టీడీపీ ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామిని అడ్డుకోవడంతో ఆయనను టీడీపీ సభ్యులు తోసేశారు. స్పీకర్‌తోపాటు సహచర ఎమ్మెల్యే ఎలీజాపై టీడీపీ సభ్యులు భౌతిక దాడి చేస్తుండడంతో సంతనూతలపాడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పోడియంపైకి వచ్చి వారిని అడ్డుకోబోయారు. ఆయనపైనా దాడికి పాల్పడుతూ పక్కకు తోసేయడంతో సుధాకర్‌బాబు పోడియం హ్యాండ్ రెయిలింగ్‌పై పడిపోయారు. దీంతో సుధాకర్‌బాబు ఎడమ మోచేతికి గాయమైంది.

డిప్యూటీ సీఎంపై 'డోలా'అనుచిత వ్యాఖ్యలు

తనపై జరిగిన దాడితో పాటు సభలో టీడీపీ సభ్యుల దుశ్చర్యకు మనస్తాపం చెందిన స్పీకర్ సీతారాం సభ నుంచి తన చాంబర్‌లోకి వెళ్లిపోయారు. రోజూ రచ్చచేయడం టీడీపీ సభ్యులకు అలవాటుగా మారిందని, ఈరోజు ఏకంగా సభాపతిపైనే దాడులకు తెగబడ్డారంటూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అనడంతో.. 'నువ్వొక డిప్యూటీ సీఎం అంట్రా.. పనికిమాలిన నా కొడకా'.. అంటూ డోలా బాలవీరాంజనేయ స్వామి పరుష పదజాలంతో నానా దుర్భాషలాడడంతో మిగిలిన సభ్యులు ఆయన్ని వారించారు. అర్ధగంట అనంతరం సభ తిరిగి ప్రారంభమైన తర్వాత టీడీపీ సభ్యులను ఒకరోజు సస్పెన్షన్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. దీంతో తమను బయటకు పంపేందుకు ప్రయత్నిస్తున్న మార్షల్స్‌పైనా టీడీపీ సభ్యులు పిడిగుద్దులతో దాడికి దిగారు.

అప్రూవర్‌గా ప్రకటించడం చట్టవిరుద్ధం

వివేకా హత్య కేసులో దస్తగిరి బెయిల్ రద్దు చేయాలి

- వాచ్‌మన్ రంగన్న వాంగ్మూలాన్ని సీబీఐ పరిగణనలోకి తీసుకోవట్లేదు
- తమకు కావాల్సిన విధంగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు
- తెలంగాణ హైకోర్టులో వైఎస్ భాస్కర్‌రెడ్డి పిటిషన్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ ఆదేశించినట్లుగా ఏ–4 దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడని, దాని ఆధారంగా కేసుతో ఎలాంటి సంబంధంలేని వారిని ఇరికించాలని దర్యాప్తు సంస్థ ప్రయత్నిస్తోందని వైఎస్ భాస్కర్‌రెడ్డి తెలంగాణ హైకోర్టుకు నివేదించారు. దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించడం చట్టవిరుద్ధమని, అతడికి బెయిల్ ఇచ్చే సమయంలో కింది కోర్టు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. దస్తగిరి చెప్పిన వివరాల ఆధారంగా తనతోపాటు మరి కొందరిని నిందితులుగా చేర్చే అవకాశం ఉందన్నారు. 'దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించడాన్ని, బెయిల్ ఇస్తూ కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలి. నన్ను, మరికొందరిని నిందితులుగా చేర్చవద్దని ఆదేశాలు ఇవ్వాలి'అని అభ్యర్థిస్తూ వైఎస్ భాస్కర్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా ఈ పిటిషన్‌లోనూ వైఎస్ వివేకా కుమార్తె సునీత ఇంప్లీడ్ అయ్యారు. 'దస్తగిరి వాంగ్మూలం ఆధారంగా మమ్మల్ని నేరంలోకి నెట్టడం సమంజసం కాదు. వివేకా హత్య కేసులో దస్తగిరి కీలక పాత్ర పోషించాడు. హత్యకు ఆయుధాన్ని కొనుగోలు చేసింది అతడే. దస్తగిరికి బెయిల్ ఇచ్చేందుకు సీబీఐ పూర్తిగా సహకరించింది. దస్తగిరిపై వాచ్‌మన్ రంగన్న చెప్పిన అంశాలను కిందికోర్టు పట్టించుకోలేదు'అని వైఎస్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్ భాస్కర్‌రెడ్డి పిటిషన్‌లో మరికొన్ని అంశాలివీ..



• అన్ని ప్రశ్నలకూ సమాధానమిచ్చా...

నా వయసు సుమారు 73 ఏళ్లు. దీర్ఘకాలిక వెన్నునొప్పి, ఛాతీలో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నా. ఇప్పటికే సీబీఐ విచారణకు హాజరయ్యా. దర్యాప్తు అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చా. సీఆర్‌పీసీ సెక్షన్ 161, 164 కింద వివేకా వాచ్‌మన్ రంగన్న స్టేట్‌మెంట్‌ను దర్యాప్తు సంస్థ రికార్డ్ చేసింది. దాని ప్రకారం.. హత్య జరిగిన రోజు రంగన్న నిద్రలో ఉండగా అకస్మాత్తుగా పాత్రలు, ఇనుప రాడ్ పడిపోవడం వంటి శబ్దాలు వినపడటంతో లేచి ప్రధాన ద్వారం వద్దకు వెళ్లాడు. లోపలి నుంచి ఏడుపు లాంటి శబ్దం వినిపించడంతో పార్క్ వైపు ఉన్న ద్వారం వద్దకు వెళ్లి పక్కనే ఉన్న కిటికీ లోంచి లోపలికి చూశాడు. ఇంట్లో నలుగురు వ్యక్తులు కనిపించారు. వాళ్లు హాల్‌లో ఏదో వెతుకుతూ కనిపించారు. వారిలో ముగ్గురిని ఎర్ర గంగిరెడ్డి, షేక్ దస్తగిరి, సునీల్ యాదవ్‌గా గుర్తించాడు. నాలుగో వ్యక్తి పొడవుగా, సన్నగా ఉన్నట్లు చెప్పాడు. ఆ తర్వాత రంగన్న చీకటిగా ఉన్న తోటలోని చెట్టు దగ్గర దాక్కున్నాడు. దాదాపు 20 నిమిషాల తర్వాత పార్క్ వైపు ద్వారం తెరిచి సన్నగా, పొడవుగా ఉన్న వ్యక్తితోపాటు దస్తగిరి, సునీల్ హడావుడిగా వచ్చి కాంపౌండ్ వాల్ దూకి పారిపోయారు. అక్కడ దొరికిన ఆధారాల మేరకే పోలీసులు నలుగురిని నిందితులుగా పేర్కొన్నారు.

• మమ్మల్ని ఇరికించే ప్రయత్నం..

ఆ నలుగురే ఈ హత్య చేసినట్లు రంగన్న స్టేట్‌మెంట్ చాలా స్పష్టంగా చెబుతున్నా ఈ కేసుతో ఎలాంటి సంబంధంలేని నాతోపాటు మరికొందరిపై ఆరోపణలు చేస్తూ ఇరికించేందుకు దర్యాప్తు సంస్థ అక్రమ పద్ధతులను అనుసరిస్తోంది. వివేకా కుమార్తె సునీత, దర్యాప్తు అధికారులు వారికి తోచిన చట్టవిరుద్ధ ప్రక్రియలను ఆశ్రయిస్తున్నారు. ఇందులో భాగంగానే దస్తగిరికి కొన్ని సూచనలు చేసి వారికి కావాల్సిన విధంగా వాంగ్మూలం తీసుకున్నారు. దీంతో దస్తగిరి.. ఏ–5(శివశంకర్‌రెడ్డి)తో పాటు నాపై, మరో ఇద్దరిపై నిరాధార ఆరోపణలు చేశాడు.

• సుప్రీం ఉత్తర్వులను పట్టించుకోకుండా...

మరో ఇద్దరికి కూడా సీబీఐ నోటీసులు జారీ చేసి విచారణకు పిలవనున్నట్లు మీడియా కథనాల ద్వారా తెలిసింది. దస్తగిరి గూగుల్ టేక్ అవుట్ డేటా ఆధారంగా చేసుకుని సీబీఐ నాపై ఆరోపణలు మోపుతోంది. నాకు వ్యతిరేకంగా దర్యాప్తు చేస్తోంది. సీబీఐ అనుసరించిన విధానం పూర్తిగా చట్టవిరుద్ధం. హత్య కేసులో నిందితుడైన కిరాయి హంతకుడికి ముందస్తు బెయిల్ ఇవ్వకూడదని సుప్రీం కోర్టు పలుమార్లు తీర్పులిచ్చింది. అప్రూవర్‌గా మారిన దస్తగిరి వాంగ్మూలం ఆమోదయోగ్యం కాదు. దస్తగిరి చెప్పిన దానికి ఎలాంటి సాక్ష్యం లేదు. నేరంలో నలుగురు పాలుపంచుకున్నారు. వీరిలో తక్కువ నేరం చేసిన వారు జైలులో ఉండగా కీలక పాత్ర పోషించిన దస్తగిరికి మాత్రం బెయిల్ ఇవ్వడం సరికాదు. గంగిరెడ్డి ఆదేశాల మేరకు హత్యలో దస్తగిరి కీలక పాత్ర పోషించాడు. దీని కోసం భారీ మొత్తంలో నగదు కూడా తీసుకున్నాడు. ఆయుధాన్ని తెచ్చానని, హత్యలో ప్రధాన పాత్ర పోషించానని కూడా ఒప్పుకున్నాడు. ఈ అంశాన్ని కిందికోర్టు మేజిస్ట్రేట్ పరిగణలోకి తీసుకోలేదు. బెయిల్ ఇచ్చేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా వివరణ తీసుకోవాల్సి ఉండగా అలా చేయలేదు. అప్రూవర్‌గా మారడం, బెయిల్ ఇవ్వడం అంతా చట్టవిరుద్ధంగానే జరిగింది. బెయిల్ మంజూరు చేస్తూ కిందికోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలి. దస్తగిరి వాంగ్మూలం ఆధారంగా నన్ను నిందితుడిగా చేర్చవద్దని సీబీఐని ఆదేశించాలి.

'స్కిల్డ్' క్రిమినల్ స్కామ్!

▶ మొదటి పేజీ తరువాయి

సీమెన్స్ పేరుతో స్కామ్ జరిగింది. ఇలాంటి గొప్ప స్కామ్‌ను నడిపిన వ్యక్తి నారా చంద్రబాబే. అక్షరాలా రూ.371 కోట్ల ప్రజాధనాన్ని మాయం చేశారు. ఈ డబ్బును షెల్ కంపెనీల ద్వారా రకరకాల రూటింగ్ చేసి మళ్లీ చంద్రబాబు నివాసం ఉంటున్న హైదరాబాద్‌కు తరలించారు. స్కిల్డ్ క్రిమినల్ చేసిన స్కామ్ ఇది. ప్రజాధనాన్ని దోచేయడంలో చంద్రబాబు చాతుర్యం చూడాలంటే స్కిల్ స్కామ్‌ను ఉదాహరణగా చెప్పవచ్చు.

ముందుగానే ఊహించి..

చేయని స్కిల్ డెవలప్‌మెంట్ ఎలా చూపించాలి..? దోచేసిన డబ్బును ఎలా జేబులోకి తెచ్చుకోవాలి..? చట్టానికి దొరక్కుండా ఏ ఫైల్స్‌ను ముందుగానే మాయం చేయాలి..? దర్యాప్తు జరిగితే తప్పించుకోవడానికి ఏం చేయాలి..? అసలు విచారణ జరగకుండా ఏం చేయాలి..? ఇవన్నీ ముందుగానే ఊహించుకుని రూపకల్పన చేశారు. ఒక క్రిమినల్ మాత్రమే ఇలా చేయగలుగుతాడు. అవినీతికి నిజంగానే విజన్ ఆయన. 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే ఈ స్కిల్ స్కామ్ ఊపిరి పోసుకుంది. ఇందుకోసం తనకు కావాల్సిన మనుషులను చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లోకి తీసుకొచ్చారు. సీమెన్స్ కంపెనీలో ఓ ఉన్నతోద్యోగిగా ఉన్న వ్యక్తితో లోపాయికారీగా వీళ్లు లాలూచీ పడ్డారు. అతడి ద్వారా దోపిడీకి పాల్పడ్డారు. ఈ ప్రాజెక్టు ఖర్చు రూ.3,356 కోట్లు. ఇందులో ప్రభుత్వ వాటా 10 శాతం, సీమెన్స్ కంపెనీ 90 శాతం భరిస్తుందన్నారు. ప్రపంచంలో ఎక్కడైనా ఓ ప్రైవేట్ కంపెనీ రూ.3 వేల కోట్ల గ్రాంట్ ఇస్తుందా..? పోనీ చంద్రబాబు ముఖాన్ని చూసి ఇస్తారా...? రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా ప్రాజెక్టు తీసుకోవాలంటే ఒక పద్ధతి ఉంటుంది. కానీ ఇక్కడ డీపీఆర్ కూడా తయారు చేయలేదు. ముందస్తుగానే ఆ కంపెనీలో లాలూచీ పడ్డ ఇద్దరు వ్యక్తులు రూపొందించిన డీపీఆర్‌ను స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఒక నోట్ పెట్టించారు. కనీసం టెండర్ లాంటి ప్రక్రియ కూడా ఈ ప్రాజెక్టులో లేదు. చంద్రబాబుకు మాత్రమే ఇటువంటిది సాధ్యం. ఈ స్కామ్.. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత తవ్విందీ కాదు. చంద్రబాబు హయాంలోనే ఇది బయటకు పొక్కింది. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, ఎల్లో మీడియా ఏ ఒక్కరూ మాట్లాడలేదు. చివరకు దత్తపుత్రుడు కూడా అడగలేదు. దోచుకో, పంచుకో, తినుకో (డీపీటీ).. ఇదే వీళ్ల విధానం.

గ్రాంట్ అనే పదమే లేకుండా ఒప్పందం

రాష్ట్రంలో 6 క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని, ఒక్కో క్లస్టరులో ఒక్కో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అని, 5 టెక్నికల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్స్ కూడా ఏర్పాటు చేస్తామని జీవోలో చెప్పారు. ఒక్కో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు రూ.546 కోట్లు ఖర్చు చేస్తామని, ఇందులో 90 శాతం ఖర్చును సీమెన్స్, డిజైన్‌టెక్ గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద అందిస్తుందని, మిగిలిన 10 శాతం అంటే ఒక్కో సెంటర్‌కు రూ.50 కోట్లు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం భరించాలని చెప్పారు. ప్రాజెక్టు వ్యయంలో పది శాతం, పన్నులతో కలిపి రూ.371 కోట్లను ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. మిగిలిన రూ.3 వేల కోట్లను సీమెన్స్ సంస్థ గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా ఉదారంగా ఇస్తుందంటూ కేబినెట్‌లో చెప్పారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద వచ్చిందంటే ఆ డబ్బును మనం తిరిగి ఇవ్వాల్సిన అవసరం లేదు. అయితే ఒప్పందం దగ్గరకు వచ్చేసరికి 90 శాతం గ్రాంట్ ఇన్ ఎయిడ్ ప్రస్తావన పూర్తిగా ఎగిరిపోయింది. ఆ పదమే ఎక్కడా కనిపించలేదు. ప్రభుత్వం ఇవ్వాల్సిన 10 శాతం వాటా కాస్తా రూ.330 కోట్లు ఫైనాన్షియల్ అసిస్టెన్స్‌గా మారిపోయింది. కుంభకోణానికి ఇక్కడే బీజం పడింది. ఒప్పంద పత్రంలో వివరాలు నింపాల్సిన చోట ఖాళీగా విడిచిపెట్టారు. ఏ తేదీన ఒప్పందం కుదిరిందన్న విషయాన్ని కూడా రాయలేదు. జీవోలో ఉన్నది ఒప్పందంలో లేనప్పుడు ఎలా సంతకాలు చేశారు?

సీమెన్స్ నుంచి పైసా రాలేదు

గత ప్రభుత్వం 10 శాతం నిధులను విడుదల చేసినప్పుడు సీమెన్స్ కంపెనీ నుంచి రావాల్సిన గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఒక్క పైసా కూడా రాలేదు. అసలు ఆ ప్రాజెక్టు గురించే ఆ కంపెనీకి తెలియదు. గత ప్రభుత్వం ఐదు దఫాల్లో రూ.371 కోట్లు విడుదల చేసింది. ఆ మొత్తం షెల్ కంపెనీల నుంచి చంద్రబాబుకు చేరిన వెంటనే దఫాల వారీగా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేశారు.

జిల్లా వార్తలు

23న రామాలయ హుండీ లెక్కింపు


భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను ఈనెల 23న లెక్కించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ ఈఓ ఎల్.రమాదేవి తెలిపారు. హుండీ లెక్కింపునకు సిబ్బంది సకాలంలో హాజరు కావాలని ఆమె కోరారు.

ప్రతీ గిరిజనుడి చెంతకు ప్రభుత్వ పథకాలు


దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏపీఓ, డీడీ

భద్రాచలం: ప్రభుత్వాలు ఐటీడీఏ ద్వారా అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ గిరిజనుడికి చేరేలా అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన డీడీ రమాదేవితో కలిసి గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఏపీఓ మాట్లాడుతూ దరఖాస్తులను సత్వరమే పరిశీలించి అర్హత మేరకు పరిష్కరించాలని, ప్రభుత్వ పథకాలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సురేష్‌బాబు, మునీర్‌పాషా, భాస్కర్, ప్రభాకర్‌రావు, శ్రీనివాస్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడల్లో జిల్లా ఉద్యోగుల ప్రతిభ


విజయం సాధించిన తెలంగాణ జట్టు

ఖమ్మం స్పోర్ట్స్: జాతీయస్థాయి సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడాపోటీలు భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో జరుగుతున్నాయి. ఈమేరకు ఫుట్‌బాల్ టోర్నీలో గుజరాజ్ జట్టుపై తెలంగాణ విజయం సాధించింది. తెలంగాణ జట్టులో ఖమ్మం ప్రాతినిధ్యం వహిస్తున్న ఉద్యోగులు కె.ఆదర్శ్‌కుమార్, ఇర్ఫాన్, కృష్ణారావు జట్టు విజయం కీలక పాత్ర పోషించగా, ఫుట్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.


విద్యుత్ లైట్ల వెలుతురులో భద్రాద్రి రామాలయం

■ ట్రయల్ అదిరింది!

రానున్న శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా భద్రాచలంలోని రామాలయంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈనెల 22న పట్టాభిషేకం, 26న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుంది. దీంతో ఆలయ ప్రధాన గోపురంతో పాటు ఉపాలయాలు, వైకుంఠ ద్వారం, చుట్టుపక్కల రంగురంగుల లైట్లు అమరుస్తున్నారు. ఈమేరకు ఈఓ రమాదేవి, ఇంజనీరింగ్ ఈఈ రవీందర్ సమక్షాన సోమవారం రాత్రి ట్రయల్ రన్ చేపట్టి పరిశీలించారు.

– భద్రాచలం

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మానుకోట జెడ్పీ చైర్‌పర్సన్ బిందు

గార్ల: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వాన అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మహబూబాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గార్లలోని వర్తకసంఘం భవనంలో సోమవారం నిర్వహించిన పార్టీ ఆత్మీయ సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తుండగా, మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అయితే, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రతీ ఇంట్లో ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందుతున్న విషయాన్ని ప్రచారం చేయాలని సూచించారు. నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా ఉంటూ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈసమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, ఎంపీపీ శివాజీచౌహాన్, సర్పంచ్‌లు అజ్మీరా బన్సీలాల్, మోతీలాల్, ధరావత్ సక్రు, భూక్యా బుజ్జి, జ్యోతితో పాటు శీలంశెట్టి రమేష్, ఎండీ.ఖదీర్, రాధాకృష్ణ, అమర్‌చంద్, సురేష్, మీగడ శ్రీనివాస్, భాస్కర్‌రావు, మురళి, వీరారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బిందు

యువ ఉగాది ఉత్సవాలకు వలంటీర్లు

మహబూబాబాద్/మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో సోమవారం జరిగిన యువ ఉగాది ఉత్సవాలకు మహబూబాబాద్ జిల్లా నుంచి వలంటీర్లను వెళ్లారు. ఈమేరకు హైదరాబాద్‌కు వలంటీర్లు బయలుదేరగా, ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ వీపీ.ప్రసాద్ మాట్లాడారు. ఐఆర్‌సీఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు, గవర్నర్ తమిళిసై సమక్షంలో రాజ్‌భవన్‌లో జరిగిన యువ ఉగాది ఉత్సవాల్లో మానుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి 10మంది వలంటీర్లు ఎంపికయ్యారని చెప్పారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజుతో పాటు డాక్టర్ నెహ్రూ, రవిచందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సౌజన్య, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు 'పీ-జీ శిక్షా బెటియాన్ స్కాలర్‌షిప్'


స్కాలర్‌షిప్ అందజేస్తున్న పీ-జీ ప్రతినిధులు

సాక్షి, సిటీబ్యూరో: చర్మ సంరక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థ ప్రోక్టర్ అండ్ గ్యాంబుల్ ఇండియా(పీ-జీ ఇండియా) ఆధ్వర్యాన పాల్వంచలోని హరిత ఎకోలాజికల్ ప్రైవేట్ ఐటీఐలో విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్) కోర్సులు అభ్యసిస్తున్న 29 మంది ప్రతిభావంతులైన బాలికలకు సోమవారం స్కాలర్‌షిప్ అందజేయడంతో పాటు స్టెమ్ కోర్సుల్లో మహిళలకు ఉన్న ఉపాధి అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా పీ-జీ ఇండియా హైదరాబాద్ మాన్యుఫ్యాక్చరింగ్ సైట్ ప్లాంట్ హెడ్ శుభ్రాంగ్సు దత్తా మాట్లాడుతూ స్టెమ్ కోర్సుల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచేందుకు స్కాలర్‌షిప్ ఇవ్వడంతో పాటు 'ఉమన్ ఇన్ స్టెమ్ కారవాన్' పేరిట రోడ్ షో నిర్వహిస్తున్నామని తెలిపారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టే వరకూ పోరాటం

సత్తుపల్లిటౌన్/తల్లాడ/సత్తుపల్లి రూరల్: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించేలా పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టే వరకు పోరాడుతామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పిండిప్రోలు రామ్మూర్తి తెలిపారు. సత్తుపల్లిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన రూ.లక్ష కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు ఉన్నా, చట్టసభల్లో లేకపోవటంతో వెనుకబడుతున్నందున ఉద్యమాలు ఉధృతం చేస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యాన వచ్చే నెల 3, 4వ తేదీల్లో చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జిల్లా నుంచి బీసీలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. అనంతరం రామ్మూర్తిని పలువురు సన్మానించారు. ఇక తల్లాడలో జరిగిన రామ్మూర్తి మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న బీసీలందరికీ వెంటనే రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశాల్లో నాయకులు రాజబోయిన ప్రసాదరావు, ఏలూరి రవి, వేముల వెంకట్, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, ఎల్.మహేష్, ఎం.వెంకటాచారి, వెంకట్రామయ్య, పి.రామారావు, వెంకటేశ్వర్లు, వీరబ్రహ్మాచారి, సత్యం, కృష్ణ పాల్గొన్నారు. కాగా, అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి రామ్మూరి ఆర్థికసాయం అందజేశారు.


రామ్మూర్తిని సన్మానిస్తున్న నాయకులు

'సింగరేణి' గుర్తింపుపై నేడు వాదనలు

- హైకోర్టు ఉత్తర్వుల ఆధారంగా నిర్ణయం తీసుకునే అవకాశం
- మే తర్వాత తాము సిద్ధమేనంటున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణపై హైకోర్టులో మంగళవారం వాదనలు జరగనున్నాయి. గుర్తింపు సంఘం కాలపరిమితి పూర్తయి ఏడాదిన్నర దాటినందున త్వరగా ఎన్నికలు నిర్వహించేలా ఆదేశించాలని ఏఐటీయూసీ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహించాలని తీర్పునిచ్చింది. కానీ సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం ఉత్పత్తి లక్ష్యంలో వెనుకబడినందున.. మే నెల వరకు గడువు ఇవ్వాలని అధికారులు కోరుతున్నారు. ఇక ఎన్నికల నిర్వహణ ప్రక్రియ, బ్యాలెట్ బాక్స్‌ల సమీకరణ, కార్మికుల సభ్యత్వాలు పరిశీలన తదితర అంశాలకు రెండు నెలల సమయం పడుతుందంటూ డీవైసీఎల్సీ సైతం ఎన్నికల నిర్వహణకు గడువు కోరారు. ఈ నేపథ్యాన మంగళవారం హైకోర్టులో వాదనలు జరగనున్నాయి. ఇక హైకోర్టు ఇచ్చే ఆదేశాలకు అనుగుణంగా వచ్చే నెల 2వ తేదీన డీవైసీఎల్సీ వద్ద సింగరేణి అధికారులు, జాతీయ కార్మిక సంఘాల నాయకులు సమావేశానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సమావేశంలోనే గుర్తింపు సంఘం ఎన్నికల తేదీ ప్రకటించే అవకాశముందని.. ఎన్నికలు జూన్, జూలై నెలల్లో జరగొచ్చనే ప్రచారం జరుగుతోంది. ఈలోగా రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల నోటిఫికేషన్ వస్తే కనక సింగరేణి ఎన్నికలు మరింత ఆలస్యమవుతాయని తెలుస్తోంది.

ఏప్రిల్, మే ఉత్పత్తికి అనుకూలం



సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణకు యాజమాన్యం వ్యతిరేకం కాదు. అయితే, ఏప్రిల్, మే నెలల్లో విద్యుత్ వినియోగం పెరిగి బొగ్గు ఉత్పత్తి పెంచాల్సి ఉంటుంది. ఈ రెండు నెలలు బొగ్గు ఉత్పత్తికి అనుకూలం కాగా, ఆతర్వాత వర్షాలు మొదలైతే ఆటంకాలు ఏర్పడుతాయి. అందువల్ల మే తర్వాత గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణకు మాకెలాంటి అభ్యంతరం లేదు.

– ఏ.కుమార్‌రెడ్డి, జీఎం పర్సనల్(ఐఆర్‌పీఎం)

మోడల్ స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు పోటీలు

పాల్వంచరూరల్: భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలం కిన్నెరసాని(బాలురు), కాచనపల్లి(బాలికలు)లోని స్పోర్ట్స్ మోడల్ స్కూళ్లలో ఐదో తరగతి విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు కిన్నెరసానిలో సోమవారం తుదిదశ పోటీలు నిర్వహించారు. గతనెలలో జరిగిన ప్రాథమిక పరీక్షల్లో అర్హత సాధించిన వారికి ఇక్కడ పరీక్షలు నిర్వహించినట్లు ఐటీడీఏ క్రీడల అధికారి డాక్టర్ వీరూనాయక్ తెలిపారు. గతంలో ఎంపికైన విద్యార్థుల జాబితాను పది రోజుల్లో వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు. క్రీడల పరిశీలకులు జ్యోతి, ఇన్‌చార్జి బుగ్గా వెంకటేశ్వర్లు, పీడీ అన్నం వెంకటేశ్వర్లు, పాఠశాల హెచ్‌ఎం చందు, పీడీలు ఎస్.సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, నగేష్, మోతీలాల్, హరికృష్ణ, కృష్ణవేణి, బి.వెంకటేశ్వర్లు, సునంద, మారప్ప తదితరులు పాల్గొన్నారు.


పరుగు పందెం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి

వైరా: నాణ్యమైన విత్తనాలు సమకూర్చుకుని పంటలు సాగుచేస్తేనే రైతులు అధిక దిగుబడి సాధించగలుగుతారని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విద్యాలయం విత్తన సంచాలకుడు డాక్టర్ పి.జగన్మోహనరావు తెలిపారు. వైరా కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం విత్తనోత్పత్తిపై రైతులకు ఏర్పాటుచేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. రైతులు సొంతంగా విత్తనోత్పత్తి చేసుకోవడం ద్వారా మంచి ఆదాయం పొందొచ్చని పేర్కొన్న ఆయన.. పంటల వారీగా విత్తనోత్పత్తిపై అవగాహన కల్పించారు. మధిర విత్తన పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రుక్మిణి, విత్తన పరిశోధన, సాంకేతిక విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రభావతి, డాక్టర స్వర్ణలత మాట్లాడగా కేవీకే, మధిర పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ జె.హేమంత్‌కుమార్, డాక్టర్ కె.రవికుమార్, డాక్టర్ వి.చైతన్య, డాక్టర్ జెస్సీ సునీత, ఫణిశ్రీ, డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ భరత్ పాల్గొన్నారు,



సదస్సులో మాట్లాడుతున్న జగన్మోహనరావు